బస్టాండులో సమస్యల హోల్ట్!


పెనుకొండ ఆర్టీసీ బస్టాండ్ ముఖద్వారం


బస్టాండ్ ప్రాంగణంలో దెబ్బతిన్న సిమెంట్ రోడ్డు


పడిపోయిన మరుగుదొడ్ల గోడలు

- దెబ్బతిన్న సిమెంట్ రోడ్డు, మరుగుదొడ్ల గోడలు
- ప్రయాణికులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు

పెనుకొండ: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమస్యలు తిష్టవేశాయి. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. రోజూ వేలాది మంది ప్రయాణికులు ఇక్కడ నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. దాదాపు 50 ఏళ్ల క్రితం నిర్మించిన బస్టాండు నిర్వహణ గురించి అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా బస్టాండ్ లోపలికి బస్సులు ప్రవేశించే ప్రాంతంలో సిమెంట్ రోడ్డు దెబ్బతిని పెద్ద గుంత పడింది. బస్సుల రాకపోకలకు అవరోధంగా మారుతోంది.

పట్టించుకునేవారేరీ?

బస్టాండ్‌లోని మరుగుదొడ్ల గోడలు దెబ్బతినడమే కాక కొన్ని చోట్ల కిందకు పడిపోయాయి. అయినా వాటి మరమ్మతు గురించి పట్టించుకునేవారు కరువయ్యారు. ఇక ప్రయాణికులు తమ వాహనాలు నిలపడానికి స్థలం లేకపోవడంతో ప్రధాన దారికి ఎదురుగానే నిలపాల్సి వస్తోంది. దీంతో ప్రయాణికులు బస్టాండ్ లోపలికి, బయటకు వెళ్లడానికి సమస్యగా మారింది. ఇక బస్టాండులో ఏర్పాటు చేసిన అరుగులు దెబ్బతిన్నా వాటి మరమ్మతు గురించి పట్టించుకోవడం లేదు.

నూతన బస్టాండ్ నిర్మాణమెప్పుడో?

ఆర్టీసీ బస్టాండ్‌ను పూర్తిగా తొలగింపజేసి నూతన బస్టాండ్ నిర్మిస్తామని ఇటీవల రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళీశాఖామాత్యులు సవిత పేర్కొన్నారు. బస్టాండ్ దుస్థితిపై పలువురు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన మంత్రి నూతన బస్టాండ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అయితే పనులు ఎపుడు ప్రారంభమవుతాయన్నది తెలియరావడం లేదు. ఇప్పటికైనా అధికారులు బస్టాండులో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. అలాగే రాత్రి 8 గంటల అనంతరం బస్సుల రాకపోకలు లేకపోవడంతో. అత్యవసర పరిస్థితులు ఎదరైనప్పుడు జాతీయ రహదారిపైకి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

ఎస్సీల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ కట్టుబడి ఉంది


వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులతో సమన్వయకర్త దీపిక తదితరులు

చిలమత్తూరు: ఎస్సీల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ కట్టుబడి ఉందని నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. గురువారం హిందూపురం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, నియోజకవర్గంలోని ఎస్సీ సెల్ నేతలు సమన్వయకర్త దీపికతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీల సమస్యలపై వైఎస్సార్‌సీపీ పోరాడుతుందన్నారు. నియోజకవర్గంలో ఎస్సీలకు సముచితం స్థానం కల్పిస్తామన్నారు. అనంతరం సమన్వయకర్త టీఎన్ దీపిక, వేణురెడ్డిని వారు సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సూర్యమోహన్, మాజీ కౌన్సిలర్ రామ్మూర్తి , నాయకులు శ్రీరాములు, నరసింహులు, రవి, శ్రీకాంత్, చందు, మద్దిలేటి, నారాయణప్ప, సీనప్ప, అంజినప్ప, మూర్తి, అశ్వర్థ, సిద్దప్ప, మహేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానించి దృశ్యం

రొద్దం: సానిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వివిధ ప్రాంతాలకు వెళ్లిన ఉపాధ్యాయులను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు నారాయణస్వామి, కృష్ణానాయక్, లక్ష్మినారాయణ, మోహన్‌రెడ్డి సేవలను కొనియాడారు. అనంతరం వారిని శాలువాల, పూలమాలలతో సత్కరించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోండి

రొళ్ల: వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉండటంతో విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ శివానంద్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని అవినకుంట కేజీబీవీ పాఠశాలను గుడిబండ పీహెచ్‌సీ వైద్యాధికారి శివానంద్ ఆరోగ్య సిబ్బందితో కలిసి సందర్శించారు. తొలుత వంటగది, కుళాయిలు, మరుగుదొడ్లు ఇతరాత్ర వాటిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో సమావేశమయ్యారు. రోజూ పౌష్టికాహారంతో కూడిన ఆహారాన్ని రోజు తీసుకోవాలని తెలిపారు. ప్రిన్సిపాల్ మున్వార్‌జాన్, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంబులెన్స్ డ్రైవర్ దుర్మరణం


పవన్ (ఫైల్)

పావగడ: ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్‌గా పని చేస్తున్న బోయ పవన్ (25) చిక్కబళ్లాపురం వద్ద ప్రధాన రోడ్డుపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. బెంగళూరు నుంచి పావగడకు ద్విచక్ర వాహనంలో వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో శరీరం పూర్తిగా ఛిద్రం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పెనుకొండకు చెందిన పవన్ బతుకుతెరువు కోసం పావగడకు వచ్చాడు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో ఓ ప్రైవేట్ అంబులెన్స్‌కు డ్రైవర్‌గా పని చేసేవాడు. విషయం తెలుసుకున్న పవన్ తల్లిదండ్రులు, బంధువులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్థానిక గుట్టహళ్లిలోని మృతుడి నివాసానికి తీసుకొచ్చారు. అనంతరం శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

న్యాయం చేయాలంటూ బాధితుల నిరసన


మార్చురీ వద్ద నిరసన తెలుపుతున్న బాధితులు, గ్రామస్తులు

హిందూపురం టౌన్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ఎదుట న్యాయం చేయాలంటూ చిన్నారి తల్లిదండ్రులు నిరసన తెలిపారు. పరిగి మండలం శాసనకోట వద్ద ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ నిర్లక్ష్యంగా నడపటంతో ఊటుకూరుకు చెందిన అఖిల్ బుధవారం మృతి చెందిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో బాధితులు, ఊటుకూరు గ్రామస్థులు తమకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీ వద్ద నిరసన తెలిపారు. వీరికి పలు ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఇసుక అక్రమ తరలింపును, ఇసుక త్రవ్వకాలను ఆపాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న వన్ టౌన్ సీఐ రాజగోపాల్ నాయుడు అక్కడి చేరకుని నిరసన తెలుపుతున్న వారితో మాట్లాడారు. బాధితులు అక్కడి నుంచి వన్ టౌన్ పోలీసుస్టేషన్ వద్దకు వెళ్లగా, ఇది పరిగి పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన ఘటన అని, అక్కడి పోలీసులతో మాట్లాడాలని సీఐ చెప్పడంతో వెనుదిరిగారు.

చిరుధాన్యాలతో చింతలేని ఆరోగ్యం


మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఏఓ వీరనరేష్

గుడిబండ: చిరు ధ్యాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని మండల వ్యవసాయ అధికారి వీరనరేష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం అధికారుల ఆధ్వర్యంలో గ్రామ సంఘాల మహిళలకు రాగి, చిరుధాన్యాల పంటల వలన ఆరోగ్య లాభాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ కృష్ణమీనన్ మాట్లాడుతూ.. మహిళలు చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే రక్తహీనత తగ్గిస్తుందని తెలియజేశారు. చిరుధాన్యాల వాడకం , సాగుపై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం కొత్త రకం (ఎస్ఐఏ–3159) రాగి కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం సైంటిస్ట్ రామసుబ్బయ్య, ఏపీమాస్ ప్రాజెక్ట్ మేనేజర్ గోపాల్‌రావు, ఎఫ్‌పిఓ దేవరాజు, రైతు సేవా కేంద్రాల అధికారులు, గ్రామ సంఘాల మహిళలు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం అందించాలి

హిందూపురం టౌన్: ముద్దిరెడ్డిపల్లిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను మండల విద్యాధికారి గంగప్ప గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలసి భోజనం చేశారు. మధ్యాహ్నం భోజనం మెనూపై ఆరా తీశారు. రుచికరమై, నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. అలాగే పాఠశాలలో ఉన్న సమస్యల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలు సుధామణి, ఉపాధ్యాయులు మాట్లాడుతూ అరవింద్ నగర్ క్రాస్ నుంచి ముద్దిరెడ్డిపల్లి హైస్కూల్ వరకు రోడ్డు బాగా లేదని, రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంక్‌ను తొలగించాలని కోరారు.

ఆర్డీటీకి మద్దతుగా పోస్టు కార్డు ఉద్యమం


దొడగట్టలో పోస్ట్‌కార్డులు చూపుతున్న విద్యార్థులు


రత్నగిరిలో ర్యాలీ చేపట్టిన విద్యార్థులు

రొద్దం: ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం దొడగట్ట ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి ఆర్డీటీకి ఎఫ్ఆర్‌సీఏ మంజూరు చేయాలని కోరుతూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు పోస్ట్ కార్డులు పంపారు. ఎఫ్ఆర్‌సీఏ రెన్యూవల్ చేయకపోవడంతో పేద విద్యార్థులు ఎంతగానో నష్టపోతున్నారని విద్యార్థులు పేర్కొన్నారు.

రొళ్ల: ఆర్డీటీ సేవలను యథావిధిగా కొనసాగించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, ఆ సంస్థ ఏటీఎల్ ఓబుళేష్ తదితరులు డిమాండ్ చేశారు. గురువారం మధ్యాహ్నం మండల పరిధిలోని రత్నగిరి ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఆర్డీటీ సిబ్బందితో కలిసి ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునురద్ధరించాలంటూ నిరసన ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ.. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయకపోతే పేదల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

వ్యవసాయ మోటర్లకు స్మార్ట్ మీటర్లు బిగించొద్దు


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పెనుకొండ: వ్యవసాయ మోటర్లకు స్మార్ట్ మీటర్లు బిగించరాదని జిల్లా రైతు సంఘం అధ్యక్షులు హరి పేర్కొన్నారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు, విద్యుత్ చార్జీలు పెంపుపై ప్రజా సంఘాలు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాయి. సీఐటీయూ నాయకులు బాబావలి అధ్యక్షతన సమావేశంలో హరి మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం గెలిచిన అనంతరం హామీలను తుంగలో తొక్కుతూ ఏడాదిలో రూ.15,485 కోట్ల సర్దుబాటు చార్జీలపేరుతో అదనపు భారం రాష్ట్ర ప్రజలపై మోపడం అన్యాయమన్నారు. అధిక విద్యుత్ వినియోగించే సమయంలో అధిక రేట్లు నిర్ణయించి వసూలు చేయడం దారుణమన్నారు. అదాని స్మార్ట్ మీటర్లు, సోలార్ విద్యుత్ ఒప్పందాలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ ఆనాడు స్మార్ట్ మీటర్లు పగులగొట్టండి అని పిలుపునిచ్చిన నారా లోకేష్ మంత్రి అయిన అనంతరం నేడు స్మార్ట్ మీటర్లు బిగించాలని ఆదేశాలివ్వడం రాష్ట్ర ప్రజలకు నమ్మక ద్రోహం చేయడమే నన్నారు. నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీ దేవి జయంతి ఉత్సవాలు


అమ్మవారి ఆలయంలో అఖండ జ్యోతిని వెలిస్తున్న కమిటి సభ్యులు


కంసాలపేట అమ్మవారి ఆలయంలో హోమాలు చేస్తున్న దృశ్యం

హిందూపురం: చౌడేశ్వరీదేవి జయంతి సందర్భంగా హిందూపురం పలు ప్రాంతాల్లో అమ్మవారి ఆలయాల్లో ఉత్సవాలు, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ముదిరెడ్డిపల్లి ఇలవెల్పు చౌడేశ్వరీదేవి ఆలయంలో మూలవిరాట్ అమ్మవారికి గురువారం తెల్లవారుజామున పంచామృతాభిషేకాలు, కుంకుమ, పసుపులతో ఆకుపూజలతో విశేషంగా వెండి అభరణాలతో అలంకరించి విశేషంగా పూజలు చేపట్టారు. అనంతం ఆలయంలో హోమాలు నిర్వహించారు. అలాగే భక్తిశ్రద్దలతో అఖండ జ్యోతి వెలిగించి పూజలు చేశారు. తర్వాత మహిళలు బోనాలు తలపై పెట్టుకుని మేళతాళలతో ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద అన్నదానాలు చేపట్టారు. కార్యక్రమంలో ధర్మకర్త బండారుబాలాజి, కమిటీ అధ్యక్షులు నాగరాజు,పల్లాచంద్ర,రఘు, సురుపురవి, విశ్వనాథ్,నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని కంసాలపేటలోని దేవాంగ కులదైవం చౌడేశ్వరీ మాత జయంతి వేడుకలు సంఘం ఆధ్వర్యంలో వైభవంగా చేపట్టారు. కార్యక్రమంలో కమిటీ ప్రముఖులు దేవాంగం శంకరప్ప, రంగస్వామి, సోమశేఖర్, నంజుండప్ప, శివశంకర్, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని కొటిపి గ్రామంలో వెలసిన గ్రామ ఇలవెల్పు చౌడేశ్వరీదేవి అమ్మవారి ఆలయంలో చౌడేశ్వరీ అమ్మవారి జయంతిని పురస్కరించుకుని పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు.

గురుకుల పాఠశాలకు ఆర్ఓ ప్లాంట్ వితరణ


ఆర్ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

చిలమత్తూరు: మండలంలోని టేకులోడు క్రాస్‌లో ఉన్న మహాత్మాజ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలకు హైదరాబాదు చెందిన సాహితి గగన్ మహల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 1000 లీటర్ల సామర్థ్యం గల రూ.1.70 లక్షలు విలువచేసే ఆర్ఓ ప్లాంట్‌ను వితరణ చేసినట్టు ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. ఈ మేరకు గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ట్రస్ట్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి సహకారంతో పాఠశాలకు తాగునీటి సమస్య పరిష్కారమైందన్నారు. ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లేపాక్షి: లేపాక్షిలో ఉన్న మహాత్మాజ్యోతిబా పూలే ఏపి గురుకుల పాఠశాలలో సాహితి గగన్ మహల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 1000 లీటర్ల సామర్థ్యం కలిగిన ఆర్వో వాటర్ ప్లాంట్ రూ. 1.70 లక్షలు విలువ చేసే కారర్పొరేట్ సోషియల్ రెస్పాన్సిబులిటి కింద సీసీఎల్ ప్రొడక్స్ హైదరాబాద్ వారు ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. సాహితి గగన్ మహల్ అధ్యక్షుడు, న్యాయవాది ప్రతాప్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుందరరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

115 పోలింగ్ స్టేషన్ విభజన

రొళ్ల: స్థానిక జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో ఉన్న 115 పోలింగ్ కేంద్రంలో ఓటర్ల శాతం పెరగడంతో ఆ పోలింగ్ కేంద్రంలోని ఓటర్లతో కొత్తగా 131 పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తూ ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపినట్లు తహసీల్దార్ షేక్షావలి తెలిపారు. గురువారం ఈ మేరకు మడకశిర తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ ఎన్నికల అధికారి సూర్యనారాయణరెడ్డి ఐదు మండలాల తహసీల్దార్లతో పోలింగ్ కేంద్రాల విభజన అంశం సమీక్ష సమావేశం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఒక పోలింగ్ కేంద్రంలో 1,300 ఓటర్లు మాత్రమే ఉండాల్సి ఉందని తెలిపారు. కాని రొళ్ల మండల కేంద్రంలో ఉన్న 115 పోలింగ్ కేంద్రంలో 1,309 మంది ఓటర్లు ఉండటంతో ఆ పోలింగ్ కేంద్రాన్ని రెండుగా విభజించడానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని పేర్కొన్నారు. ఈ క్రమంలో 115 పోలింగ్ కేంద్రంలో 654 మంది ఓటర్లుగా.. కొత్తగా ఏర్పాటుకానున్న 131 పోలింగ్ కేంద్రంలో 655 ఓటర్లుగా ఉండేలా విభజించడం జరిగిందన్నారు. ప్రస్తుతం రొళ్ల మండల వ్యాప్తంగా మొత్తం 35 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వెల్లడించారు.

'ఆడబిడ్డ నిధి'కి మంగళం


సమన్వయకర్త టీఎన్ దీపిక

చిలమత్తూరు: ఆడబిడ్డ నిధి ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన చంద్రబాబు నేడు పథకం అమలు చేయకుండా ఆడబిడ్డలను మోసం చేస్తున్నాడని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక మండిపడ్డారు. ఈ మేరకు గురువారం ఆమె పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మాలని మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వాఖ్యలపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. హామీలు ఇచ్చే ముందు, వాటిని అమలు చేయలేమని తెలియదా చంద్రబాబూ అంటూ ఆమె ప్రశ్నించారు. తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతి కోసం ఇచ్చిన హామీలన్నీ ఐదేళ్ల పాటు అమలు చేశారని గుర్తుచేసిన ఆమె.. చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక 13 నెలల్లోనే చేతులెత్తేశాడని ఎద్దేవా చేశారు. రామగిరి మండలంలో మైనర్ బాలికను అతి కిరాతకంగా అత్యాచారం చేసినా బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి హామీ రాకపోవడం దురదృష్టకరమన్నారు. మహిళల పట్ల కూటమి నేతలు ఎంత క్రూరంగా ప్రవర్తిస్తున్నారో హిందూపురంలో ఓ మహిళతో అసభ్యంగా మాట్లాడిన ఆడియో సంభాషణ నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దల్లో మార్పు రావాలని, కక్ష సాధింపు చర్యలు మాని పరిపాలన, ప్రజలకు రక్షణ కల్పించడంపై దృష్టిసారించాలని సూచించారు. లేని పక్షంలో ప్రజల్లో తిరుగుబాటు వస్తుందని , అప్పుడు ప్రభుత్వ పతనం ఖాయమన్నారు.

ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకోం..


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అగళి: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్పను అవహేళన చేస్తూ ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునేది లేదని పార్టీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం ఆయన సర్పంచులు, మండల నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడారు. కేడర్ లేని టీడీపీ నాయకులు సైతం ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. జగన్ ప్రభుత్వంలో అభివృద్ధి జరగలేదంటూ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఇచ్చిన హామీలన్నీ ఏడాది కాలంలో 98 శాతం అమలు చేయడం జరిగిందన్నారు. పార్టీలకు అతీతంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికి చెల్లుతుందని పేర్కొన్నారు. పదవులు ఇస్తారనే ఆశతో సమన్వయకర్త ఈరలక్కప్పను మీ స్థాయిని మించి మాట్లాడటం సరికాదన్నారు. ఒక్కసారి మీ స్థాయి తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. 2024 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ జనసేన కలిసి పోటీ చేసిన అగళి మండలంలో వైఎస్సార్‌సీపీకి 900 ఓట్ల మెజారిటీ వచ్చిందని గుర్తు చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అత్యధిక స్థానాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మహేంద్రప్ప, సర్పంచులు ముద్దరాజు, బసవరాజు, కృష్ణప్ప, నాయకులు నాటరాజు, వెంకటస్వామి, సతీష్, హనుమంతరాయప్ప, గంట నాగరాజు, శివన్న, గిరీష్, లింగరాజు, కృష్ణ, మధు, ఈరన్న అనుబంధ కమిటీ సభ్యులు బోజే గౌడ్, నాగరాజు, శ్రీనివాసులు, నాగేంద్ర, సోషల్ మీడియా కన్వీనర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల తనిఖీ

లేపాక్షి: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలకు ఎదురుగా ఉన్న బీసీ బాలికల వసతి గృహం, కంచిసముద్రం రోడ్డులోని బీసీ బాలుర వసతి గృహాలను తహసీల్దార్ సౌజన్యలక్ష్మి గురువారం తనిఖీ చేసారు. బాలికల హాస్టల్‌లో మరుగుదొడ్ల మరమ్మతులను ఆమె పరిశీలించారు. అదేవిధంగా వసతి గృహం పక్కన కొంత మంది నీటి సమస్య సృష్టిస్తున్నారనే విషయం తహసీల్దార్‌కు విన్నవించారు. అనంతరం బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ముఖ్యంగా బాలురకు ఆర్వో వాటర్ ప్లాంట్ లేక పోవడం, మంచాలు, బెడ్‌షీట్‌లు లేక పోవడంపై ఆరా తీశారు. తాగునీటి కోసం ఆర్వో వాటర్ ప్లాంట్ అవసరమని గుర్తించి కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు తహసీల్దార్ తెలిపారు. రెవెన్యూ సిబ్బంది, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రత్యంగిరదేవి హోమం

హిందూపురం: హిందూపురంలోని సూరప్ప కట్ట వద్ద ఉన్న బోయకొండ గంగమ్మదేవి ఆలయంలో గురువారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ఆలయ ఆవరణంలో భక్తుల మధ్య శత్రు సంహారిణి ప్రత్యంగిరాదేవి హోమం చేపట్టారు. మంత్రోచ్ఛారణలతో మోహన్ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారి హోమాలు నిర్వహించి కాళికాదేవికి కుంభపూజ, రక్తాభిషేకం, నరదిష్టి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యం చూపుతున్న ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య, సిబ్బంది

హిందూపురం టౌన్: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో హిందూపురం నుంచి పోచనపల్లి వెళ్లే దారిలో మధుగిరి తాలుకా కొడిగేనహళ్లి పంచాయతీకి చెందిన ప్రభుకుమార్ అనే అతడు ద్విచక్ర వాహనంలో కర్ణాటక మద్యం తరలిస్తుండగా అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య గురువారం తెలిపారు. అతడి నుంచి 188 టెట్రా ప్యాకెట్స్ కర్ణాటక మద్యం స్వాదీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు. అలాగే కర్ణాటక మద్యం రవాణా చేస్తూ కేసులు నమోదైన నలుగురు నిందితులను రూ.లక్ష పూచీకత్తుపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు పృథ్వీ, ఫరూక్, నారాయణ స్వామి, హెడ్ కానిస్టేబుల్స్ నరసింహ, వెంకటేష్, రమణ, సతీష్, కానిస్టేబుల్స్ అంజి, సురేష్, రవీంద్ర, కుమార్, రంగధామ, శివ, సుధాకర్ రెడ్డి, ఉస్మాన్, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలు విజయవంతం చేయండి

పెనుకొండ: ఈ నెల 31 నుంచి ఆగస్ట్ 1వ తేదీ వరకు ధర్మవరంలో జరిగే సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ డివిజన్ నాయకుడు శ్రీరాములు కోరారు. గురువారం పట్టణంలో మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. పార్టీ శ్రేణులు మహాసభలకు పెద్దయెత్తున రావాలన్నారు. మండల కార్యదర్శి నరసింహులు, నాయకులు మల్లికార్జున, కిష్టప్ప, జయలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల వితరణ

పెనుకొండ: నగర పంచాయతీలోని వెంకటరెడ్డిపల్లి ఎంపీయూపీ స్కూల్‌కు పూర్వ విద్యార్థి ఖాజా కుర్చీలను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఖాజాను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నారాయణస్వామి, సిబ్బంది గిరిజమ్మ, భారతమ్మ, కరుణ, రేష్మ, ఆనందమ్మ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

అమరాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10:30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ రామారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యురాలు, సర్పంచులు, కో–ఆప్షన్ సభ్యుడు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. మండల స్థాయి అధికారులు తమ శాఖ పరిధిలోని నివేదికలను తప్పని సరిగా తీసుకుని సమావేశానికి రావాలని ఆయన ఆదేశించారు.

పార్టీ పటిష్ట నిర్మాణానికి కృషి

హిందూపురం: నియోజకవర్గంలో బీఎస్పీని బలోపేతం చేయడానికి కమిటీలుకృషి చేయాలని బిఎస్పీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు సూచించారు. గురువారం నియోజకవర్గ బీఎస్పీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లుగా దాసరి ఈశ్వరయ్య, పెన్నయ్య, నియోజకవర్గ అధ్యక్షుడిగా కె. రామాంజనప్ప, ఉపాధ్యక్షుడిగా మౌలాలి, ప్రధాన కార్యదర్శిగా సుబ్బరాయప్ప, కార్యదర్శిగా గంగాధరప్ప, కోశాధికారి గంగాధర్ తదితరులను ఎన్నుకున్నారు.

ఎస్ఐగా పదోన్నతి

రొళ్ల: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న బి.చిన్న బాలాజీకి ఎస్ఐగా పదోన్నతి లభించింది. గురువారం కర్నూల్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అధికారి డాక్టర్ కోయ ప్రవీణ్ (ఐపీఎస్) ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఏఎస్ఐగా పని చేస్తున్న బి.చిన్నబాలాజీని అన్నమయ్య జిల్లాకు పదోన్నతిపై ఎస్ఐగా బదిలీ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. స్థానిక ఎస్ఐ వీరాంజనేయులుతో పాటు పోలీస్ సిబ్బంది బి.చిన్నబాలాజీకి శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయంలో చోరీకి యత్నం

పావగడ: నిడుగల్ దుర్గంలో వెలసిన పురాతన జైన పార్శ్వనాథ దేవాలయంలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు చొరబడ్డారు. ఎవరూ గుర్తు పట్టకుండా ముఖానికి ముసుగు వేసుకుని కొంత మంది చోరులు పథకం ప్రకారం ఆలయ తలుపులకు వేసిన తాళాన్ని గ్యాస్ కట్టర్‌తో విరగ్గొట్టారు. అయితే ఆలయంలో ఎలాంటి విలువైన వస్తువులు లేకపోవడంతో నిరాశతో వెనక్కి వెళ్లినట్లు తెలుస్తోంది. దొంగలు ఆలయంలోకి ప్రవేశించిన దృశ్యాలన్నీ సీసీ కెమరాలో నిక్షిప్తమయ్యాయి. అరసికెరె పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాజేంద్ర ఘటనా స్థలానికి చేరుకుని ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆలయ సమితి పదాధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సీసీ పుటేజీలు పరిశీలించి దొంగల ఆచూకీ కనుక్కొంటామని పోలీసులు తెలిపారు.